ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



రామంతాపూర్ : వాసవినగర్‌లో 3,4వ వీధుల్లో నెలకొన్న భూగర్భ డ్రైనేజీ సమస్యలను ఉప్పల్ నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకారపు అరుణ్‌పటేల్, జలమండలి మేనేజర్ రవీందర్, ఇన్‌స్పెక్టర్ కిషన్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. త్వరలోనే హబ్సిగూడ డివిజన్‌లోని సమస్యల పరిష్కారానికి జలమండలి ఎండీ అశోక్‌రెడ్డిని కలిసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. స్థానిక సంక్షేమ సంఘం నేతలు యాదయ్య, కిషోర్, జాంగీర్, లక్ష్మి, పాషా, లింగారెడ్డి, సంపత్, నగేష్, ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

బస్సులో పోలీసుల ఆకస్మిక తనిఖీలు



మేడిపల్లి: ప్రజల భద్రతా దృష్ట్యా అవగాహన కార్యక్రమంలో భాగంగా బుధవారం మేడిపల్లి ఇన్‌స్పెక్టర్ గోవిందరెడ్డి ఆధ్వర్యంలో మేడిపల్లి ప్రధాన రహదారి, వరంగల్ హైవేలో ఆర్టీసీ బస్సులు, ఆటోల్లో ప్రయాణిస్తున్న ప్రయాణికుల బ్యాగులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. ప్రయాణ సమయంలో అనుమానాస్పద వస్తువులు, ఎవరైనా కొత్త వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలని పోలీసులు సూచనలు చేశారు. సురక్షితంగా ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

పీర్జాదిగూడ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా దుర్గ



మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా ఎస్ఎస్‌కె. దుర్గ నియమితులయ్యారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు, మేడ్చల్ జిల్లా అధ్యక్షురాలు రాజనాల లక్ష్మీ చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా దుర్గ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ తన సేవలను గుర్తించి పార్టీ అధిష్టానం పీర్జాదిగూడ నగర పాలక మహిళా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలిగా బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ పదవి కోసం సహకరించిన కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ దర్గదయాకర్‌రెడ్డి, అమర్‌సింగ్, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు, కో- ఆప్షన్ సభ్యులు, పార్టీ నేతలు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు.

డిప్యూటీ మేయర్ భర్త డ్రైవర్ వసూళ్ల దందా !

కేసు నమోదు చేసిన ఉప్పల్ పోలీసులు

ఉప్పల్: ఉప్పల్ సర్కిల్ పరిధిలో వసూళ్ల దందా నడుపుతున్న ఓ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ ప్రధాన రహదారిపై బజారు రామరాజుగౌడ్ తన సొంత స్థలంలో ఇంటి నిర్మాణం చేపట్టాడు. ఈ క్రమంలో గత కొద్ది రోజులుగా ఫోన్‌లో డబ్బులు ఇవ్వాలని, లేదంటే ఇళ్లు కూల్చివేస్తానని తుల్జాసింగ్ అనే వ్యక్తి బెదిరింపులకు పాల్పడుతున్నట్లు బాధితుడు వాపోయాడు. దీంతో విసుగుచెందిన రామరాజు కుమారుడు నవీన్‌గౌడ్ బుధవారం అతడిపై ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. పోలీసుల దర్యాప్తులో జీహెచ్‌ఎంసీ అధికారిగా చలామణి అవుతూ.. ఇప్పటికే నిర్మాణదారుల నుంచి లక్షలాది రూపాయాలను వసూలు చేసినట్లు బాధితులు చెబుతున్నారు. సదరు వ్యక్తి జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ భర్త వద్ద డ్రైవర్‌గా ఉన్న తుల్జాసింగ్ అని విచారణలో తేలింది. ఈ మేరకు తగిన చర్యలు తీసుకోనున్నట్లు ఇన్‌స్పెక్టర్ ఎలక్షన్‌రెడ్డి వివరించారు.

హనుమాన్ చాలీసా పారాయణం

అల్వాల్: హనుమాన్ దీక్ష చేపట్టిన స్వాములు అల్వాల్‌లో బుధవారం సామూహిక హనుమాన్ చాలీసా పారాయణం నిర్వహించారు. మచ్చ బొల్లారం, వెంకటాపురం, అల్వాల్ తదితర ప్రాంతాల నుంచి వచ్చిన హనుమాన్ భక్త బృందం అల్వాల్ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. దుర్గాప్రసాద్‌స్వామి, బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు గొట్టిముక్కల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

‘మీ సేవల్లో’ దోపిడీ..!

మీ సేవా కేంద్రాల్లోకి అడుగుపెడితే జేబు గుల్ల

- లబోదిబోమంటున్న సామాన్య ప్రజలు
- రేషన్‌కార్డుల దరఖాస్తుల మాటున దోచుకుంటున్న వైనం
- అడిగినంత ఇవ్వకుంటే కొర్రీలు

ఉప్పల్: ‘మీసేవా’ అంటే పౌరుల సేవా అని అర్థం. పాలనలో పారదర్శకత, ప్రజలకు మరింత సౌకర్యవంతమైన సేవలను అందించడమే లక్ష్యంగా రాష్ట్రంలో మీసేవా, ఈ సేవా కేంద్రాలను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చింది. మీ సేవా అనేది తెలంగాణ ప్రభుత్వం ప్రజలకు అందించిన ఆన్‌లైన్ సేవా కేంద్రం. ఈ కేంద్రాల్లో దాదాపుగా 150కి పైగా ప్రభుత్వం, 600లకు పైగా ప్రైవేట్ సంబంధిత ఆన్‌లైన్ చెల్లింపుల సేవలను అందిస్తున్నారు. ఉప్పల్ మండల పరిధిలో దాదాపుగా 20 వరకు ఈ సేవా, మీసేవా కేంద్రాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

ఎలాంటి పనులకైనా మీ సేవా కేంద్రానికే..

ప్రభుత్వం నుంచి ఎలాంటి సేవలు పొందాలన్నా.. మీ సేవా కేంద్రాలనే సంప్రదించాలి. జనన, మరణ ధ్రువీకరణపత్రాల నుంచి మొదలుకొని విద్యార్థుల కుల, ఆదాయ, నివాసం, ధ్రువీకరణపత్రాలు, రేషన్‌కార్డులు, పోలీస్ సేవలు, విద్యా సంబంధిత సేవలు, ఆర్టీఏ సేవలు ఇలా.. ఎలాంటి పొందాలన్నా.. మీ సేవా కేంద్రం గడప తొక్కాల్సిందే.

ప్రభుత్వ ఆశయాలకు తూట్లు..

కొన్ని మీ సేవా కేంద్రాలు ప్రభుత్వ ఆశయాలను తూట్లు పొడుస్తూ.. అర్థమే మారేలా కేంద్రం నిర్వాహకులు ప్రవర్తిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రజల అవసరాలను ఆసరా చేసుకుని అందిన కాడికి దోచుకుంటున్నారని ప్రజలు వాపోతున్నారు. ప్రశ్నిస్తే ఏదో ఒక సాకుతో కొర్రీలు పెడుతూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని చెబుతున్నారు. దీంతో దిక్కుతోచని పరిస్థితుల్లో అడిగినంత ఇచ్చి పని చేయించుకుంటున్నారు. ఇక కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక రేషన్‌కార్డుల జారీ ప్రక్రియ ఊపందుకుంది. వందలాది మంది మీ సేవల వైపు పరుగులు తీస్తున్నారు. కొత్తకార్డు కావాలన్నా, పేర్లను జత చేయాలన్నా, పేర్లను తొలగించాలన్నా మీసేవా, లేదా ఈ సేవా కేంద్రాలను సంప్రదించాల్సిన పరిస్థితి ఉంది.

నిబంధనలు మరిచారు..

ప్రభుత్వ నిబంధనలను కొందరు నిర్వాహకులు తుంగలో తొక్కి ఒక్కో సేవకు, ఒక్కో రేటు కట్టి మరీ వసూళ్లకు పాల్పడుతున్నట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేషన్‌కార్డులో నుంచి పేరును తొలగించాలంటే దరఖాస్తుకు రూ. 45 తీసుకోవాల్సిది పోయి రూ. 100, పేర్లను కలపాలంటే రూ. 300 వరకు వసూలు చేస్తున్నట్లు బాధితులు అంటున్నారు.

పనిలో నిర్లక్ష్యం.. అడిగితే బెదిరింపులు..

తాము అడగినంత ఇవ్వకుంటే కార్డును రిజక్ట్ చేస్తామంటూ బెదిరింపులకు పాల్పడుతున్నట్లు దరఖాస్తుదారులు ఆరోపిస్తున్నారు. పెద్ద మజీద్ ఉప్పల్ వార్డు కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మీ సేవా కేంద్రంలో అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తున్నారని, నిర్వాహకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అదేమని ప్రశ్నిస్తే.. ‘ఎవ్వరకి చెప్పుకుంటారో చెప్పుకోండి’ అంటూ కఠినంగా వ్యవహరించడంతో బాధితులు ఉప్పల్ తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన అధికారులు విచారణకు ఆదేశించినట్లు సమాచారం.



మండల పరిధిలోని పౌరసేవా కేంద్రం (ఫైల్)

ఎవరికి ఫిర్యాదు చేయాలంటే.. ?

మీ సేవా కేంద్రాల్లో ఎలాంటి సేవల్లో లోపం కనిపించినా, ధరల పట్టికలో సూచించిన దానికంటే అధికంగా డబ్బులను ఇవ్వాలని డిమాండ్ చేసినా.. నేరుగా తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయొచ్చు.

విధిగా ధరల పట్టిక బోర్డును ఏర్పాటు చేయాలి..



పౌర సేవా కేంద్రాల్లో విధిగా ధరల పట్టికను అందరికీ కనిపించేలా బోర్డులను ఏర్పాటు చేయాలి. కొన్ని కేంద్రాల్లో సరైన విధంగా డాక్యుమెంట్లు స్కానింగ్ చేయకపోవడం వల్ల రిజక్ట్ అవుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. మండల పరిధిలోని ప్రతి పౌరసేవా కేంద్రాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేస్తాం. ప్రభుత్వ ధరల కంటే అధికంగా దరఖాస్తుదారుల నుంచి వసూలు చేస్తున్నట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. అవసరమైనే కేంద్రాలను సీజ్ చేస్తాం.

– ఉప్పల్ మండల తహసీల్దార్ వాణిరెడ్డి

రహదారి పక్కనే డంపింగ్ !



చెత్త,చెదారంతో మల్లిఖార్జుననగర్ రహదారి

గౌతంనగర్: గౌతంనగర్ నుంచి మల్లిఖార్జుననగర్‌కు వెళ్లే రహదారి మీదుగా ఇళ్ల నుంచి వ్యర్థాలను సేకరించి రిక్షా కార్మికులు రోడ్డుపై పారవేసి దుర్గంధమయంగా చేస్తున్నారు. గత కొంతకాలంగా రోడ్డు పక్కనే కుప్పలుకుప్పలుగా వ్యర్థాలను పారవేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రధాన రహదారి పక్కనే చెత్తకుప్పలను దాంట్లో సేకరించిన వ్యర్థాలను తీసుకొచ్చి ఇక్కడ పారవేస్తూ.. వస్తువులను వేరు చేస్తున్నారని, దీనివల్ల ఇబ్బందులకు గురవుతున్నామని స్థానికులు చెబుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం



సార్వత్రిక సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నేతలు

ఉప్పల్ : 20న నిర్వహించ తలపెట్టిన అఖిల భారత సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని బుధవారం ఉప్పల్ సీఐటీయూ కార్యాలయంలో సీఐటీయూ, ఏఐటీయూసీ, బీఆర్టీయూ సంఘాల ఆధ్వర్యంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకన్న, వెంకటేష్, పట్టాభిరామయ్య, జగ్గారెడ్డి, సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మల్లాపూర్: 20న జరగబోయే దేశవ్యాప్త కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ నాచారం కార్యదర్శి గణేష్ పిలుపునిచ్చారు. బుధవారం దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు సంబంధించిన కరపత్రాలను వాయిత్ ఇండియా కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలు ఉపసంహరించుకోవాలన్నారు. సత్యంగౌడ్, నర్సింగ్‌రావు, శ్రీనివాస్, అలీ, సుధాకర్, సత్యనారాయణ, ప్రభాకర్, రాజు, షకీల్, బాలరాజ్, నరేష్, మల్లారెడ్డి, ఉపేందర్, కనకయ్య, శేఖర్‌రెడ్డి, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.


‘సీఎం చొరవతోనే నిధుల మంజూరు’



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రజితాపరమేశ్వర్‌రెడ్డి

ఉప్పల్: సీఎం రేవంత్‌రెడ్డి చొరవతోనే ఉప్పల్‌కు అత్యధికంగా నిధులు మంజూరు అవుతున్నాయని ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందముల పరమేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం ఉప్పల్ డివిజన్ భూగర్భ డ్రైనేజీ వ్యవస్థకు రూ.4 కోట్ల నిధులతో చేపడుతున్న పనులను కార్పొరేటర్ రజితాపరమేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. ఆనంద్‌నగర్, పద్మావతికాలనీ, సెవన్‌హిల్స్ కాలనీ, వెంకటేశ్వర్ కాలనీలో డ్రైనేజీ సమస్య తీరనుంది. వాటర్‌వర్క్స్ అధికారులు సత్యనారాయణ, ఏఎంహెచ్‌వో రంజిత్, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, పద్మావతి కాలనీ అధ్యక్షుడు లక్ష్మణ్, సెవెన్ హిల్స్ కాలనీ అధ్యక్షుడు శ్రీధర్‌గుప్తా, వెంకటేశ్వర్‌కాలనీ అధ్యక్షుడు నరసింహచారి, అంజిరెడ్డి, భానుప్రకాష్, దేవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణలపై హైడ్రా అధికారుల ఫోకస్ !



యాప్రాల్ మెహర్‌బాబా కాలనీలో పర్యటిస్తున్న అధికారులు

అల్వాల్: కాలనీలో రోడ్డు ఆక్రమణలకు గురవుతుందంటూ.. అందిన ఫిర్యాదుల మేరకు హైడ్రా అధికారులు స్పందించారు. బుధవారం నేరెడ్‌మెట్ డివిజన్‌లోని యాప్రాల్ మెహర్‌బాబా కాలనీలో వారు పర్యటించారు. ఈ కాలనీలో ప్రధాన రహదారిపై కొందరు అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని, జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో కూల్చివేతలు చేపట్టారు. తిరిగి ఇటీవల తిరిగి నిర్మాణాలు ప్రారంభించడంతో కాలనీవాసులు హైడ్రాను ఆశ్రయించారు. ఈ మేరకు బుధవారం హైడ్రా అధికారులు, జీహెచ్‌ఎంసీ అధికారులు రోడ్డు ఆక్రమణలను పరిశీలించి, తగిన చర్యలు తీసుకుంటామని స్థానికులకు హామీ ఇచ్చారు. కాలనీకి సంబంధించిన లేఅవుట్, రెవెన్యూ వివరాలను అధికారులకు అందజేశారు.

అర్హులకు రేషన్‌కార్డులు జారీ చేయాలి

ఉప్పల్: అర్హులైన నిరుపేదలను గుర్తించి వారికి తప్పకుండా రేషన్ కార్డులను జారీచేయాలని ఉప్పల్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు మారిణేని ఫణీందర్ ఉప్పల్ సర్కిల్ సివిల్ సప్లై అధికారి సంధ్యను కోరారు. ఈ మేరకు బుధవారం స్థానిక నేతలతో కలిసి రేషన్‌కార్డుల జారీపై ఆరా తీశారు. ఇప్పటికీ 20,585 రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు వచ్చాయని, వాటిలో అర్హులను గుర్తించి ఇప్పటి వరకు 426 కార్డులను మాత్రమే జారీచేసినట్లు ఆమె వివరించారు. తీగ విఠల్‌రావు, రమేష్, తాళ్లపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మల్కాజిగిరి: ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. న్యూ మీర్జాలగూడకు చెందిన శశిమోహన్(52) వ్యాపారి. ఈనెల 10న అదే ప్రాంతంలోని సోనియా ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ వద్ద అతడి తలకు గాయమై పడి ఉన్నాడు. సత్తిరెడ్డినగర్‌లో నివాసం ఉంటున్న శశిమోహన్ సోదరుడు రామకృష్ణకు ఫోన్ ద్వారా స్థానికులు సమాచారం అందించారు. సోదరుడు అక్కడకు చేరుకుని అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించాడు. చికిత్స పొందుతూ అతడు మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంటల వ్యవధిలోనే యజమాని చెంతకు..

- పోగొట్టుకున్న బంగారు ఆభరణాలు
- సీసీ ఫుటేజీ ఆధారంగా బాధితులకు అందజేత



ఆభరణాల బ్యాగును బాధితులకు అందజేస్తున్న పోలీసులు

మేడిపల్లి: పీర్జాదిగూడ మన్సిపల్ కార్పొరేషన్ పరిధిలో స్కూటీపై వెళ్తుండగా కిందపడిపోయిన బ్యాగులోని 10 తులాల బంగారు ఆభరణాలను బాధితులకు గంటల వ్యవధిలో అందించిన ఘటన మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేడిపల్లికి చెందిన భార్యాభర్తలు స్కూటీపై వెళ్తున్న సమయంలో పీర్జాదిగూడ పంచవటి కాలనీ వద్దకు రాగానే బైక్‌పై నుంచి బ్యాగు కిందపడిపోయింది. వారు కొద్దిదూరం వెళ్లి చూసేసరికి వారి బ్యాగు కనిపించలేదు. దీంతో కంగుతిన్న బాధితులు వెంటనే మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు సకాలంలో స్పందించి సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించగా ఓ ప్యాసింజర్ ఆటో వ్యక్తి కిందపడిపోయిన బ్యాగును తీసుకెళ్లడాన్ని గమనించారు. ఆ ఆటోను సీసీ ఫుటేజీల ఆధారంగా పరిశీలించి, అదేదారిలో వెళ్లి ఆటోను కనిపెట్టారు. అనంతరం ఆ ఆటోలో వారి బ్యాగ్ కనిపించింది. పోలీసులు బ్యాగును పరిశీలించగా బ్యాగులోని 10 తులాల బంగారు ఆభరణాలు ఉన్నాయి. బాధితురాలు షమాకు పోలీస్‌స్టేషన్‌లో బంగారాన్ని తిరిగి అప్పగించారు. గంటల వ్యవధిలోనే బంగారాన్ని అప్పగించినందుకు పలువురు పోలీసులను అభినందించారు.

ఇండియన్ ఆర్మీకి సంఘీభావం.. అభినందన



ఇండియన్ ఆర్మీకి అభినందనలు తెలుపుతున్న ఏఐటీయూసీ నేతలు

కుషాయిగూడ: దేశం కోసం ప్రాణాలు అర్పించిన ఇండియన్ ఆర్మీకి ఏఐటీయూసీ జాతీయ నాయకులు వీ.ఎస్‌బోస్ అభినందనలు తెలిపారు. బుధవారం ఈసీఐఎల్‌లో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అభినందన సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశ భద్రతావ్యవస్థలకు ఆయుధాలు తయారుచేసి అందించిన ప్రభుత్వరంగ సంస్థలను గుర్తుచేశారు. యుద్ధంలో శత్రువులను మట్టుపెట్టిన బ్రహ్మోస్, ఆకాశ్, సుకోయి వంటి మిస్సైల్స్‌ను యుద్ధ విమానాలను డెవలప్‌మెంట్‌తో పాటు పరికరాల తయారీలో కృషిచేసిన డీఆర్డీఓ, బీడియల్, ఈసీఐఎల్, బీఈఎల్, హెచ్‌ఏయల్ వంటి ప్రభుత్వరంగ సంస్థలను కొనియాడారు. శంకర్‌రావు, దామోదర్‌రెడ్డి, నరసింహారావు, నరసింహ, నారాయణ, మోహన్, బాలకృష్ణ పాల్గొన్నారు.

స్థానిక సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న సుభాష్‌నగర్ కాలనీవాసులు

అల్వాల్: పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా భూగర్భ డ్రైనేజీ పైపులైన్ సామర్థ్యాన్ని పెంచాలని వెంకటపురం డివిజన్ సుభాష్‌నగర్ కాలనీవాసులు ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఇటీవల నిర్మాణాలు అధికమవడంతో తరచూ కాలనీలో డ్రైనేజీ సమస్య అధికమవుతుందన్నారు. వీటికి అనుగుణంగా భూగర్భ డ్రైనేజీ సామర్థ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. వర్షాకాలం వస్తే వర్షపు నీరు సైతం పైపులైన్‌లోకి వెళ్లడంతో కాలనీఅంతా మ్యాన్‌హోల్‌లు పొంగిపొర్లి బురదమయంగా మారుతుందన్నారు. అధికారులతో చర్చించి సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటానని, ఎమ్మెల్యే కాలనీవాసులకు హామీ ఇచ్చారు. బీఆర్‌ఎస్ నాయకులు అనీల్‌కిషోర్‌గౌడ్, ప్రభాకర్, ప్రసాద్, ఆనంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్, జలమండలి అధికారులు

మల్కాజిగిరి: డివిజన్ పరిధిలోని కాలనీ సమస్యలపై దృష్టి సారించాలని మల్కాజిగిరి డివిజన్ కార్పొరేటర్ శ్రవణ్ అన్నారు. బుధవారం సెయింట్ థామస్ స్కూల్, షిర్డీ సాయికాలనీ, యాదవబస్తీలో రూ.20 లక్షలతో చేపట్టిన యూజీడీ, సీసీరోడ్ల నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం మున్సిపల్ శానిటరీ అధికారులతో కలిసి శానిటేషన్‌ను పరిశీలించారు. అనంతరం విష్ణుపురి ఎక్స్‌టెన్షన్‌లో నూతనంగా నిర్మించిన పైపులైన్ పనులను పరిశీలించి అసంతృప్తి వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ నాసిరకంగా పనులు చేశారని, అధికారులు కూడా పరిశీలించలేదని పూర్తి విచారణ జరిపించాలని జీఎం సునీల్‌కుమార్‌ను కోరారు. కుమ్మరిబస్తీలో బోర్ మరమ్మతు పనులను పరిశీలించామన్నారు. గీతానగర్‌లో నూతనంగా డ్రైనేజీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తామన్నారు. ఏఈ నవీన్, ఏఎమ్‌హెచ్‌ఓ మంజుల, ఏఈ తేజస్విని తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



ప్రశాంత్‌నగర్‌లో లయన్స్ క్లబ్ శిక్షణాశిబిరంలో చిన్నారులు

మల్కాజిగిరి: వేసవి శిబిరాలను చిన్నారులు, విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మాజీ కార్పొరేటర్ మురుగేష్ అన్నారు. ప్రశాంత్‌నగర్ రైల్వే క్వార్టర్స్‌లో లయన్స్ క్లబ్ 320 సి ఆధ్వర్యంలో జరుగుతున్న వేసవి శిక్షణాశిబిరాన్ని సందర్శించి బిస్కెట్లు, పండ్లు, శీతల పానీయాలు అందజేశారు. మురుగేష్ మాట్లాడుతూ.. ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు నిర్వహించే శిబిరాలను ఉపయోగించుకోవాలన్నారు. దీనివల్ల పిల్లలు ఆరోగ్యంగా ఉండటమే కాకుండా వారిలో ఉన్న నైపుణ్యాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. క్లబ్ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, మోహన్‌రెడ్డి, శేఖర్‌మోరే, డాక్టర్ సంతోష్, బ్రహ్మచారి, అహ్మద్, పిట్ల శ్రీనివాస్, జంగరాజు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి వృథా !



అల్వాల్: ఓ వైపు తాగునీటి కోసం జనం విలవిలలాడుతుంటే.. మరోవైపు వందల లీటర్ల కొద్ది తాగు నీరు పైపులైన్ల లీకేజీతో రోడ్డుపాలవుతున్నాయి. నేరెడ్‌మెట్ మూడు గుడుల వద్ద మల్కాజిగిరికి వెళ్లే ప్రధాన రహదారి పక్కన పైపులైన్ ఎయిర్‌వాల్ లీకేజీతో బుధవారం వేల లీటర్ల తాగునీరు వృథాగా రోడ్డుపై పారుతుండటం చూసి జనం గగ్గోలు పెట్టారు. నీటి లీకేజీపై అధికారులకు ఫిర్యాదు అందడంతో మరమ్మతులు చేపట్టారు. ఎయిర్ వాల్వ్ లీకేజీతోనే నీరు వృథాగా పోయిందని, సమాచారం తెలిసిన వెంటనే మరమ్మతులు చేశామని అధికారులు వివరించారు.

వ్యక్తి అదృశ్యం



విష్ణు

మల్కాజిగిరి: ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై గణేష్ తెలిపిన వివరాల ప్రకారం.. మాట్ల విష్ణు (27) ఎస్పీనగర్ మౌలాలిలోని సిగ్మా బాలికల హాస్టల్‌లో వాచ్‌మెన్‌గా పనిచేస్తూ.. అక్కడే నివాసం ఉంటున్నాడు. 13న రాత్రి భార్యాభర్తలు నిద్రకు ఉపక్రమించారు. మరుసటి రోజు ఉదయం నిద్రలేచిన విష్ణు భార్య కవిత భర్తతో పాటు ఇంట్లోని బంగారం, వెండి ఆభరణాలు, నగదు కూడా కనిపించలేదు. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.68 లక్షలతో అభివృద్ధి పనులు



డ్రైయిన్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ స్వర్ణరాజ్

కాప్రా: కాప్రా డివిజన్ సైనిక్‌పురి హైటెన్షన్ రోడ్డులో డీమార్ట్ నుంచి కాప్రా చెరువు వరకు రూ.68 లక్షలతో నిర్మించే స్టోమ్ వాటర్ డ్రైయిన్ పనులను బుధవారం కార్పొరేటర్ స్వర్ణరాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వ సహకారంతో కాప్రా డివిజన్ పరిధిలో శరవేగంగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయన్నారు. అనంతరం గెలిలీయానగర్‌లోని ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో పర్యటించి క్రీడాకారులకు అదనపు గదులు నిర్మించాలని అధికారులను కోరారు. డీఈ బాలకృష్ణ, ఏఈ సూరజ్, కాంగ్రెస్ నాయకులు పవన్‌కుమార్, అరుణ్‌కిరణ్, మనోజ్‌కుమార్, దయాకర్, విజయ్‌కుమార్, అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.